


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ముకద్దర్ కా సికందర్

**మా మిత్రుడు** ఫోన్ చేసాడు. నాకో సమస్య వచ్చింది. ఎలా సాల్వ్ చేసుకోవాలో అర్థంకాక నీకు ఫోన్ చేసాను అన్నాడు.

"చెప్పు సమస్య ఏంటో?" అన్నాను.

"మా ఎదురింటి వాళ్ళ కుక్క ... రోజూ రాత్రి నేను రాసుకుందాం అని కూర్చోగానే అరుపులు మొదలవుతాయి. మధ్య రాత్రి కూడా దాని అరుపులకి వులిక్కిపడి లేస్తా. నిద్రవుండటంలేదు" అన్నాడు.

నాకు "అదరక్ కే పంజే" అన్న హిందీ నాటకం గుర్తొచ్చింది పక్కింటివాడొచ్చి "మీ పిల్లలు రాత్రంతా ఏడుస్తున్నారు. వాళ్ళకి అన్నం పెట్టవా? ఆకలేసి ఏడుస్తున్నట్టున్నారు" అంటే, ఈ పిల్లల తండ్రి తాపీగా 'మరి రోజూ రాత్రి వాళ్ళకి భోజనం పంపించచ్చుగా' అంటాడు.

ఆ స్టైల్‌లోనే నేను "ఆ కుక్కకి బిస్కెట్స్ పెట్టు" అన్నాను.

"అదొక బొక్కా?" అన్నాడు.

"పూర్తిగా విను బిస్కెట్స్‌లో ఏం కలిపి పెట్టాలో?" అన్నాను.

"ఛీ! మహా పాపం" అన్నాడు.

"అంత వద్దు. మత్తుమందు కలుపు చాలు" అన్నాను.

"రోజూనా?" నవ్వి హేళనగా అన్నాడు.

"ఒక్కరోజే పొద్దుట వెళ్ళి, మీ కుక్కకి రాత్రి మత్తుమందిచ్చా. నేను మంచివాడ్ని కాబట్టి. అదే ఇంకోడు నా కన్నా చెడ్డవాడు పక్క ఇంట్లోకి వస్తే విషం పెడ్తాడు. రోజూ రాత్రి నిద్ర లేకుండా చేస్తుంటే ఆలోచించండి అను" అన్నాను.

అతను కొంచెం ఆలోచించి "ఈ మాట బావుంది. మాట్లాడి చూస్తా" అని ఫోన్ పెట్టేసాడు. సమస్యకి సొల్యూషన్ చెప్పడం తేలిక, కానీ సమస్య పక్కవాడిదైతే. మనకే ఆ సమస్య వస్తే సలహా కోసం పక్క చూపులు చూస్తాం. సలహా అనేది ఎందుకు అడుగుతాం అంటే, మనకి సపోర్ట్ కోసం.. అంతేకాని మనకి తోచక కాదు.

మా విమల ఫోన్ చేసింది. "ఇంట్లో అద్దెకున్న వాళ్ళు మొదట మూడు నెలల అడ్వాన్స్ ఇచ్చి ఇంట్లోకి దిగారు. ఆ తర్వాత రెండేళ్ళలో మళ్ళీ రూపాయి అద్దె ఇవ్వలేదు. 21 నెలల అద్దె ఇవ్వాలి" అంది.

"సరే నువ్వు అడగటం లేదా?" అడిగాను.

"అడిగినప్పుడల్లా ఆవిడ తన కష్టాలు చెప్తోంది. అద్దె ఇవ్వడం మానేసి, ఆటోలో వచ్చి, ఆటోవాడికి డబ్బులు ఇవ్వండి. మావారొచ్చాక, ఫోన్ పే చేస్తాను అనో, మా అబ్బాయికి జ్వరం వచ్చింది డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళాలి ఓ ఆరువేలు కావాలి అనో అప్పులు తీసుకుంటుంది" అంది.

"ఎందుకు ఇస్తున్నావ్? 'నో' అనచ్చుగా" అన్నాను.

"అయ్యో! కష్టంలో వుంటే అలా ఎలా అనగలను" అంది.

"సరే! మానవత్వం కాబట్టి. ఇస్తావు. ఇల్లు ఖాళీ చెయ్యమనచ్చుగా, నీకు తలకాయ నెప్పి వుండదు" అన్నాను.

"అదికాదే మనం ఆ అద్దె మీద ఆధారపడి బతకడం లేదు. దేవుడేదో ఇచ్చాడుగా, వీళ్ళని మనం వెళ్ళిపొమ్మంటే, ఇంకో ఇల్లు చూసుకుని వెళ్తారు. వాళ్ళు అద్దెల మీద బతికే వాళ్ళైతే వీళ్ళని వెళ్ళగొడ్తారు. అప్పుడు ఈ కుటుంబం ఎక్కడ తల దాచుకుంటారు?" అంది.

నేను పెద్దగా నవ్వాను.

"ఎందుకు నవ్వుతున్నావ్?" అంది.

"నువ్వు సలహా అడుగుతున్నావా? లేక నీ సఫరింగ్ పంచుకుంటున్నావా? లేక నీలోని దానగుణం నాకు తెలియజేసి, నేను పొగిడితే సంతోషిద్దాం అనుకుంటున్నావా?" అన్నాను.

విమల కాసేపు నిశ్శబ్దంగా వుండి, "అందరూ ఇంట్లో తిడ్తున్నారు. ఆవిడ అద్దె ఇవ్వకపోయినా, ట్యాప్‌లు పాడయ్యాయి మార్పించండి అనో, మీరు బోర్ నీళ్ళు ఇస్తే మా చర్మం పాడయిపోతోంది. మంజీరా నీళ్ళు మాత్రమే ఇవ్వండి అనో డిమాండ్‌లు చేస్తుంది అందుకే మానవత్వం వెళ్ళగొట్టద్దు అంటోంది, కానీ నాలోని మామూలు మనిషి చిరాకు పడ్తోంది" అంది.

"అద్దం ముందు నిలబడకు, పాత సినిమాలు చూసిన ప్రభావం వల్ల, నీలోంచి ఇంకోత్తి ఇవతల కొచ్చి అద్దంలో నీ ప్రాణం తీస్తోంది కాబోలు" అన్నాను.

"నీకన్నీ హాస్యమేనే" అంది అలకగా.

చిన్నప్పుడు నేను కూడా అంతే. ఏదో పాడు ఆలోచన మనసులో కొచ్చేది. అవి ముకద్దర్ కా సికిందర్ వచ్చిన కొత్త రోజులు. శాంతమ్మగారు డాబామీద మాగాయ ముక్కలు ఎండబెట్టారు. ఎలాగైనా నాలుగు కొట్టేయ్యాలి అని, కానీ గండుపిల్లి ముఖంతో వాళ్ళాయన అక్కడే కుర్చీ వేసుకుని కూర్చుని పేపర్ చదువుకునేవాడు, ఎలా? అని సందానీగాడిని సలహా అడిగాను.

"సరే.. నాకీ, రెండు మాగాయి ముక్కలు ఇవ్వాలి" అనేవాడు.

"నాకి ఎందుకూ? నాకకుండానే ఇస్తా" అనేదాన్ని.

"గట్లయితే నీకీ మాగయికీ ముక్క కావాలి, ఆయనకీ ఆయన సైకిల్ అంటే మస్త్ పానం. నేనది తోలుకు పోతా, ఆయనకీ నువ్వు సెప్పు. నాకీ తరమనీకి వస్తాడు. నువ్వా నీకెన్ని ముక్కలు కావాలో తీస్కుని పారిపో" అన్నాడు.

"సరే.. అయితే రా" అని నేను ఉత్సాహంగా శాంతమ్మగారి డాబా ఎక్కి "మావయ్యగారూ.. మరే ఆ సందానీగాడేం" అని కిందకి చూస్తే ఈ మొద్దు వెధవ ఇంకా ఆయన సైకిల్ తాళం తీయడానికి తంటాలు పడ్తూ కనిపించాడు. అందుకే నేను ఆగి ఆగి అప్పయ్య పెరుగు బండిలా బ్రేక్‌లు వేస్తూ "ఆ సందానీగాడేం.. మరే.. వాడేం.. నిన్ననేం.. నాతోనేం.." అని కిందకి చూసి వాడు సైకిల్ తాళం తీసి, స్టాండ్ తీసి, దాన్ని రాయి దగ్గరకి ఈడ్చుకెళ్ళి, రాయిమీద నిలబడి ఎక్కాక

"ఏవైందే? త్వరగా చెప్పు" అని నశ్యం పీలుస్తుండగా. "అదిగో మీ సైకిల్ ఎత్తుకుపోతున్నాడు" అనేసా, మెడ్రాస్ మెయిల్లా.. అంతే.

"నా సైకిలే" అంటూ ఆయన కిందకి పరిగెత్తాడు.

నేను గబగబా మాగాయ ముక్కలు గుప్పెడు తీసుకుని పరిగెత్తుకొస్తూ, ఆగి మళ్ళీ వెనక్కెళ్ళి ఇంకో గుప్పెడు పరికిణీలో వేసి, మూటగా పట్టుకుని, మెట్లు దిగుతుండగా, వాకిలి వూడుస్తున్న శాంతమ్మగారు చీపురుతో నాకు ఎదురొచ్చింది. భయంతో "కుక్క...కుక్క..డాబా మీద నల్లకుక్క" అని ఆవిడని తొందర పెట్టేసి, మాగాయ ముక్కల్లో మూతి పెట్టేస్తోంది అత్తయ్యగారూ" అని అరిచి, "అమ్మో అమ్మో" అని ఆవిడ అటు పరిగెత్తగానే, నేను బతుకు జీవుడా! అని ఇంటికొచ్చేసాను.

కానీ అనుకున్నవన్నీ అనుకున్నట్లు జరగవు. సందానీ సైకిల్ వెనకాల, చింతబరికతో పడ్డ కాంతారావుగారు ఎదురు దెబ్బ తగిలి బొక్క బోర్లాపడి, ముందు పన్ను రాలిపోవడం, సందానీ ఎదురుగా వస్తున్న గాజులమలారం వాడ్ని గుద్ది సైకిల్‌తో, అవన్నీ కిందపడి విరిగిపోవడం వలన, సైకిల్ అక్కడే వదిలేసి, పరిగెత్తి పరిగెత్తి, అప్పుడే బయల్దేర బోతున్న ఓ లారీ వెనకాల పడి దాన్ని ఎక్కేసి, చిన్నప్పటి అమితాబ్ బచ్చన్‌లా పారిపోవడం, శాంతమ్మగారికి మాగాయ ముక్కలు కుక్క ముట్టుకుందేమోనన్న భయంతో బి.పి లో అయిపోయి, పడిపోవడం.. ఇన్ని సంఘటనలు సినిమాల్లో చూపించినట్లు 'ఈ జీవనతరంగాలలో.. ఆ దేవుని చదరంగంలో' అన్నట్లు జరిగిపోవడంతో, ఇంట్లో అమ్మమ్మ శ్యామలమ్మతో మీటింగ్ పెట్టింది. సందానీ తల్లి శోకాలు

పెడ్తూ వచ్చింది "నాదీ బిడ్డ ఆ అమితాబ్‌కి బచ్చన్ సెన్మలు సూసిన సందాని..నేను ఇంట్లకెల్లి పారిపోయి, పెద్దగయినంక వస్తా. "మేరా బాప్ చోర్" అని నా సేతి మీద పచ్చబొట్టు ఎయిపియ్యి, అని తెగలొల్లిజెయ్యి బట్టి, పంతులమ్మా, నేనేం చేసేది.. వాని అబ్బా జాన్‌కి తెలిస్తే నన్ను సంపేస్తాయ్" అని.

కంపాస్ బాక్స్‌లో మాగాయ ముక్కలు బ్లేడ్‌తో కత్తిరించి పెడ్తూ, ఆలోచించాను. "నేను సందానీగాడి సలహా తీసుకోవడం తప్పైందా?" అని. కానీ అప్పటికే ముక్కుకి పట్టీతో తొర్రి నోటితో శాంతమ్మగారి మొగుడు మావయ్యగారు, మా ఇంటికొచ్చి "ఏదీ మీ మనవషాలు. షోడు దొంగషు ఆ షందానీ ఇదీ.. వాషు ఏషీ?" అని ముందు పళ్ళు రాలిపోవడంవల్ల, కన్యాశుల్కంలో రామప్ప పంతుల్లా మాట్లాడ్తూ వచ్చారు.

అమ్మమ్మకి సరిగ్గా అర్థంకాక "ఏవిటీ అంటున్నారు? అయినా అంత దెబ్బలు ఎలా తగిలాయీ? మా సందానీ మీ సైకిల్ ఎక్కితే మాత్రం అంతలా వాడ్ని తరమాలా?" అంది.

"వాషు దొరికనీ, వెధవ షెమ్డాలెకదీష్తా దొంగ వెధవ" అంటుంటే, సందానీ తల్లి శోకాలు పెడ్తూ "నాదీ బిడ్డ ఇంట్లకెల్లి పారిపోయింది.. నీ మాయదారి సైకిల్‌ని దొంగలెత్తుకుపోను, నీకు వాతం రాను. నీకీ మావిడి చెట్టుకొమ్మ ఇరిగిపడి, నీ నడుం ఇరిగిపోను" అని తిడ్తోంది.

"ఏంషీ? ఇవన్నీ జరగాషా? జరిగింషిషాలదూ? మా ఆవిడ మీ మనవరాలు అబద్ధాలు షెప్తే డాబామీద బీ.వీ వచ్చి పడిపోయింషి" అన్నాడు కోపంగా.

నా మీదకి నేరం రాగానే మా అమ్మమ్మ సీ.ఐ.డీ బుర్ర పాదరసంలా పనిచేసింది.

"బీబీ పద పోలీస్ స్టేషన్‌లో సందానీ కనపడకుండా పోయాడు. ఈయన వల్ల అని కేసు రాయిద్దాం. ఆ కానిస్టేబుల్ మా అల్లుడికి బాగా తెలుసు" అంది.

"ఏవిషి? షందానీ.. కనిపింపకుంషా పోయాషా?" ఆయన మొహంలో భయం కనిపించింది.

మా అమ్మమ్మ పల్నాటి యుద్ధంలో కన్నాంబలా రెచ్చిపోయి" వాడిని చూసుకునే పాపం బీబీ ఎన్నో ఆశలు పెట్టుకుని బతుకుతోంది. రంగనాథ సార్ వాడికి వుచితంగా చదువు చెప్పిస్తా అన్నారు. అలాంటి రత్నంలాంటి పిల్లాడ్ని, ఎవరికీ కాకుండా చేసావు" అని అరిచింది.

"రత్నమే? ఏం రత్న? బారషరత్నా?" అని ఆయన ఎద్దేవా చెయ్యబోయాడు.

"పాపాయ్ ఆ చెప్పులు ఇటు పట్రా" అంది అమ్మని పిలుస్తూ అమ్మమ్మ.

"ఏంషమ్మా షెప్పుతో కొష్తావా? ఏం?" శాంతమ్మగారి మొగుడు బెదిరిపోయాడు.

"లేదు. పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాలిగా" తాపీగా అంది అమ్మమ్మ. దాంతో ఆయన తగ్గాడు.

"దీనికే పోలీష్ స్టేషన్ ఎందుకుషా? వాషే వస్తాడు ఆకలేస్తే.." అన్నాడు.

శ్యామలమ్మ బియ్యం చెరగడం ఆపి, చెలరేగిపోతూ "పిల్లాడు పోతే, వాడే వస్తాడా? నీ ముష్టి సైకిల్ మాత్రం, ఎత్తుకుపోయి విక్టోరియా మహారాణికి అమ్మేస్తాడనా? అంత లావు కర్ర తీసుకుని వెంటపడ్డావ్?" అని 'లా' పాయింట్ మాట్లాడింది.

నేనీలోపు వుప్పుకూడా పొట్లం కట్టుకుని కంపాస్ బాక్స్‌లో పెట్టుకుని కారం, ఆవపిండీ తీసుకుందామా? అని ఆలోచించి, 'వద్దులే' మంచి నీళ్ళు కష్టం అని బయటకొచ్చి "మావయ్యగారూ నేను నల్లకుక్కని తరిమేసాను కాబట్టి కానీ, లేకపోతే మాగాయ్ ముక్కలన్నీ తినేసేది అది. అంటు అయిపోయేవి" అన్నాను.

"ఏ నల్ల కుక్కా?" అన్నాడు.

"కుక్కలత్తమ్మ కుక్క" అనగానే, ఇదంతా ఆ షుషీలమ్మ కుక్క వల్ల వష్షిందీ? ఉండు. దాని పని షెప్తా" అని కోపంగా తిట్టుకుంటూ అటుపోయాడు.

లారీ ఎక్కి వెళ్ళిపోయిన సందానీ ఏ అర్థరాత్రో వచ్చి మా తలుపు మీద కొట్టి "ఏ.వీ రమణీ అన్నం పెట్టు" అంటాడు అనుకున్నా కానీ ఆ రాత్రి రాలేదు.

ముకద్దర్ కా సికిందర్ సినిమాలోలాగా.

"ఓ సాతీరే... తేరే బినా భీ క్యా జీనా?" అని ఏడుస్తూ పాట పాడుతుంటే, పెద్దయి అమితాబ్ బచ్చన్ అయి "ఫూలోమే కలియోమే..." అంటూ ఏ పెద్ద బంగ్లాలో నుండో, విండోలో నిలబడి నన్ను చూస్తూ పాటపాడ్తాడేమో అని ఆలోచిస్తూ, నిద్రపోయా.

మాగాయ ముక్కలు ఎక్కువ తినడం వలన నాకు మర్నాడు వాంతులయ్యాయి. నేను బడికెళ్ళలేదు. ఇంట్లోనే వుండిపోయా. అమ్మ లంచ్ టైంలో ఇంటికొచ్చినప్పుడు, అన్నం పెడ్తూ అమ్మమ్మ "మీ ఆఫీస్‌లో డ్రైవర్లకి చెప్పు సందానీగాడు ఏ బస్‌స్టాండ్‌లోనో దొరికితే ఇంటికి తీసుకు రమ్మని ఫోటో ఇచ్చింది బీబీ" అంది.

నేను చందమామ చదువుకుంటూ చెప్పాను "ఇప్పుడే రాడులే ఇప్పుడు పదకొండేళ్ళు కదా. ఇంకో పదేళ్ళు పోయాకా, అమితాబ్ బచ్చన్ అంత పొడుగై, అప్పుడు వస్తాడు "ఓ సాతీ రే.. తెరే బినా భీ క్యా జీనా?" అంటూ అన్నాను.

"అలా అని చెప్పాడా?" అమ్మమ్మ ఆశ్చర్యంగా అడిగింది.

"హీరోలు అలాగే వస్తారు, వెంటనే రారు. ఎన్ని సినిమాలు చూడలేదు మనం?" అన్నాను.

"దానికి సినిమాలు చూపించడం మానెయ్యి బాగా సినిమాల పిచ్చి పట్టింది, పాపమ్మా. నీ పిల్ల పెద్దయి సినిమాల్లో చేరిపోతుందేమో. నేను చెప్తున్నా వినిపించుకో" అంది అమ్మమ్మ కోపంగా.

మరీ అంతలా దీవించేస్తే మరేం అవుతుందీ. అలాగే జరిగింది.

సాయంత్రానికి మా అమితాబ్ బచ్చన్ కాస్తా బుగ్గల మీద గ్రీజ్ మరకలతో, దిగాలు మొహం వేసుకుని దిగబడ్డాడు సందాని 'విజయ్' గా మారకుండానే.

ఇంట్లోంచి పారిపోయిన వాళ్ళందరూ పెద్దయి అమితాబ్ బచ్చన్‌లు అవుతారనే నాకల తీరకుండానే.. అసలు ఇదంతా సందానీగాడి ముదనష్టం సలహాలవల్ల జరిగింది.

మాగాయ ముక్కల వల్ల నాకు వాంతులు. శాంతమ్మగారికి లో బీ.పి. మావయ్యగారికి పళ్ళూడాయి. అన్యాయంగా నల్ల కుక్కకి అపవాదు పాపం.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4